# పూసలలో దారం

## 11

బస్సు కదిలి వెళ్ళింది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ముందుకు నడకసాగించారు సుభద్ర, కామేశ్వరరావు. వేగంగా చాల దూరం నడిచిన తర్వాత అతను అన్నాడు. ''తెల్లవారుఝామున బయలుదేరి వెడదాం. శ్యామసుందరు వాళ్ళని చూడ్డం కూడా ఐపోయింది కదా!''అని.

ఆమె మెల్లిగా "వూ" అంది. మరికొంత దూరం నడిచేసరికి యిల్లు వచ్చింది. గేటుతీసికొని లోపలికి వెళ్ళారు. వరండాలోని లైటు వెలుతురులోకి వెళ్ళగానే కామేశ్వరరావు ఆమెవంక చూశాడు. ఆమె తలవంచుకుని, చెప్పులువదలి, లోపలికి నడిచింది. అతను అక్కడే కుర్చీలో కూర్చుండి పోయాడు.

"వడ్డించేశారు. రండి-" అన్నదామె కాస్సేపటికి వచ్చి. అతను లేవలేదు. ఆమెవంక చూశాడు మళ్ళీ. అతని చూపుని చూచి, మళ్ళీ తలవంచుకుంది.

"లేవండి మరి-మీ మామయ్యగారు విస్తరిముందు కూర్చున్నారు" అంటూ లోపలికి వెళ్ళింది.

అతను గదిలోకి వెళ్ళి, బట్టలు మార్చుకున్నాడు. లోపలికి వెళ్ళి, కాళ్ళచేతులు కడుక్కొని, తువ్వాలుతో తుడుచుకుంటూ మళ్ళీ గదిలోకి వచ్చాడు.

"ఇదిగో చూడు" అని పిలిచాడు. ఆమె వచ్చింది. కాస్సేపు ఆమెవంక రెప్పవాల్చకుండా చూసి, దగ్గరకి వెళ్ళాడు. ఆమె తల ప్రక్కకి త్రిప్పుకుంది.

"ఏమైంది? అల్లా వున్నావు?"

"ఏమీలేదు."

"ఏమీలేకపోతే, అల్లావుండవు. వాళ్ళింట్లో నీకు బాగుండలేదా? ఆవిడ ఏమన్నా అన్నదా నిన్ను? చెప్పుమరి. శ్యామసుందరు నచ్చలేదా నీకు?" గబగబ వచ్చిన యీ ప్రశ్నలకి ఆమె బిత్తరపోయింది. తనలో అస్పష్టంగా వున్న ఆలోచనలు ఇతనెందుకిల్లా అనేస్తున్నాడు పైకి-అనిపించింది.

"తర్వాత చెబుతా. మీరు పదండి భోజనానికి'' అన్నది. అతను నవ్వి, ఆమె బుగ్గమీద చిటికెవేశాడు. ఆమె అయిష్టంగా వారించింది.

భోజనాలైపోయిన తరువాత ఆమె పెట్టె సర్దసాగింది. బజార్లో కొన్నవన్నీ జాగ్రత్తగా లోపల సర్దుతోంది.

"ఇంకా చిన్నబోయిన ముఖంతో వున్నావు నువ్వు. చెప్పు." తలక్రింద దిండు ఆమెకి తగిలేలా, లాక్కుని, ఆమెవేపు చూస్తూ పడుకున్నా డతను.

ఆమె చాలా సేపు మౌనంగావుంది. కాస్సేపటికి, ఆమె ఏడుస్తున్నట్లు అనిపించింది అతనికి.

"ఛా-ఏమిటిది? చెప్పవునాకు?" అతని కంఠంలో ఆవేదన. ఆమె కొంచెం సేపు ఏడిచి, సర్దుకుంది.

అతను ఈ మాటలు కాస్సేపటికి ఆకళింపు చేసుకున్నాడు. చదువు! ఔను, మెట్రిక్కులేషనుతో ఆగిపోయిన తన చదువు, నాలుగో క్లాసైనా

పూర్తికాని ఆమె చదువు-ఇద్దరిలో వుంది ఆ తృష్ణ. పరీక్షలు పాసు కావాలని కాదు. ఏదో నేర్చుకోవాలి. ఇంకా ఏవో తెలుసుకోవాలన్న తహ తహ.

కామేశ్వరరావు నిట్టూర్పు విడిచాడు.

"ఏమండీ-అక్కడ పొలం పనులు ఎవరైనా చూచుకోరాదుటండీ-మీరు కాలేజీలో చేరండి. ఇక్కడే మామయ్యగారింట్లో వుందాము. మీరు నేర్చుకుంటూ నాకూ క్కడ నేర్పుదురుగాని" అన్నదామె.

ఈ రోజు తనలో కలిగిన ఈ సంచలనం ఆమెకి భరింపరానిదిగా వుంది. మధ్యమధ్యలో వెచ్చగా ఏదో మనసులో బాధ బయలుదేరి, క్రమంగా ప్రజ్వరిల్లి మంటగా తయారై, నిలువనీదు. మరుక్షణంలో ఆ మంట, బాధ మాయమై, పొగలాగా ఒక దిగులు ఆవరించుకుంటుంది. ఆ క్షణంలో తన పరిసరాలు, చుట్టు ప్రక్కల మనుష్యులు, చివరికి ఆయన-కూడా ఏవగింపు కలిగించేలా కనుపిస్తారు. తన నెందుకిల్లా అన్యాయం చేశారు. అమ్మ, నాన్న, అన్నయ్య, అత్తగారు-అంతా చేరి? ఆయన పట్నంలో చదువుకుంటూ వుండిపోతారని, తనూ అక్కడికే వెళ్ళి కాపురం చేస్తూ వుండవచ్చుననీ తనకి వయస్సు వచ్చినప్పటి నుండీ అనుకునేది. అతను, తను నిర్మానుష్యమైన తారు రోడ్డుమీద రాత్రిళ్ళు, గుడ్డి వెన్నెల్లో మాట్లాడుకుంటూ షికారు వెళ్ళవచ్చుననీ, సాహిత్యం, సంగీతం-ఇంకా ఎన్నింటినో గురించి మాట్లాడుకుంటూ, సంస్కారుల వలె బ్రతుకును గడిపేయాలని-! ఎన్ని అనుకుంది !

తన పల్లెటూళ్లో, అత్తవారింట్లో విస్తళ్లు కుట్టడం, మడికి నీళ్ళు చేరవేసి, తడిబట్టతో పొయ్యి వూదుకుంటూ గడపడంతో సరిపోతుంది తన బ్రతుకు. ఉత్తరం వ్రాయాలంటే పెద్ద ప్రయత్నం. పుస్తకాలు, పత్రికలు కూడా దొంగచాటుగా చదువుకోవాలి.

తనకి వెళ్ళాలని లేదు మళ్ళీ అక్కడికి-సుమిత్ర, శ్యామసుందరు, వాళ్ళపిల్లవాడు-ఎంతముచ్చట గొలిపే సంసారం వాళ్ళది! ఆమె డాక్టరు, అతను ప్లీడరు. వాళ్ళిద్దరు, ఒక సంసారస్థాయి గలవాళ్ళు. వాళ్ళది దాంపత్య మనిపించదు. అది అన్యోన్యతని మించినది. తను ఎక్కడో చదివినట్లు-వాళ్ళ స్నేహితులు, వాళ్ళఖబుర్లే వేరు. వాళ్ళ పద్ధతే వేరు తాము ఎప్పుడందుకో గలరు అల్లాంటిస్థాయి!

చేతుల్లోని వస్తువులు అల్లాగే ఉన్నాయి. గంటగడిచినా కదల్లేదు ఆమె. ఈ లోగా కామేశ్వరరావు నిద్రపోయాడు. అతను బరువుగా వూపిరి తీసుకోవడం వినిపించింది. అతనికి ఏమీపట్టదు. దొడ్లో భావి త్రవ్వించాలనీ, మరి నాలుగు యెకరాలు మెరకని మాగాణి చేయా లనీన్నూ అతని కోరికలు.

దిండులో ముఖం దాచుకుని, ఎంత సేపో ఏడుస్తూ వుండిపోయింది, సుభద్ర.

పన్నెండైంది కామేశ్వరరావు యింటికి వచ్చేసరికి. అతనితోపాటు మరి నలుగురు రైతులు వచ్చారు. వాళ్ళని సావిట్లో కూర్చోబెట్టి, లోపలికి వచ్చాడు. వస్తూనే "మంచినీళ్లు పంపించు" అంటూ కేకేసి. గదిలోకి వెళ్ళి ఉత్తరీయం వంకిన తగిలించాడు. కాస్సేపు చూశాడు-కానీ ఎవరూ రాలేదు.

వంటింటి గుమ్మం దగ్గరికి వెళ్ళి మళ్ళీ కేకేశాడు. "ఓయ్. మంచినీళ్ళు" అని. సుభద్ర పొయ్యివూదే గొట్టం అవతల పారేసి, వచ్చింది,

"ఇదుగోండి చెంబు. ఆ బానలోవి ముంచుకు త్రాగండి" అన్నది.

"చూడు-రేప్రొద్దున్న శ్యామసుందరు. వాళ్ళ ఆవిడ వస్తున్నారు. రెండు రోజులు వుండి వెళ్ళమన్నాముకదూ? ఇప్పుడు సెలవులట -

వస్తానని వ్రాశాడు. ఇంట్లోకి ఏమేం కావాలో చూడు. నేను మధ్యాహ్నం పోయివస్తా అల్లాగ" అన్నాడు. అంటూనే అతను వెళ్లిపోయాడు అవతలికి.

సుభద్ర అల్లాగే నిల్చుండిపోయింది. ఎందుకని తన మనస్సు సంతోషంతో పరవళ్లు త్రొక్కడం లేదు?

తన వూహల్లోని దేవతల్లాంటి వాళ్లు వాళ్ళిద్దరు-ఈ యిల్లునీ, తననీ చూసి నవ్వరూ? వాళ్ళతో తనేమి మాట్లాడగలదు? ఆమె ఆలోచనల్లో సతమతమవుతూ, ఖంగారుపడసాగింది. ఆ పూట వంటే సాగలేదామెకు.

—వాళ్లు వచ్చారు. ఒక గది ఖాళీచేసి, మంచం, టేబిలు అన్నీ వేయించిది. శుభ్రమైన తెల్లని దుప్పట్లు టేబిలుక్లాతు పరిచింది. అగరొత్తులు వెలిగించింది.

సుమిత్ర-వస్తూనే ఆ మంచం మీద కూలబడింది.

"అమ్మబాబోయి, ఏం ప్రయాణమండీ మీ వూరు రావాలంటే-ఢిల్లీ ప్రయాణం ఇంకా సులువనిపించిది'' అన్నది నవ్వుతూ.

"రండి-ఇల్లా కూర్చోండి. నుంచున్నారేం?" అన్నది.

సుభద్ర సందేహించింది. "మీవారు ...."

"అతనా? ఇప్పుడప్పుడే రాడులెండి. స్నేహితులిద్దరూ బాతాకానీ వేసుకుంటారు—" అన్నది.

సుభద్ర అప్పటికీ కూర్చోలేదు. భిడియపడుచు నవ్వి, "అంతే కాదులెండి. మా అత్తగారు వంటలో వున్నారు యీవేళ. నేను అన్నీ అందివ్వాలి. మైలపడితే వూరుకోరు—సరే, మీరు కాఫీ తీసుకుంటారా యిప్పుడు? లేకపోతే స్నానం చేసిన తర్వాతనా?" అన్నది.

"స్నానం యిప్పుడువద్దు. మొఖం, చేతులు కడుక్కుని కాఫీ త్రాగే స్తాను. ఇదుగో, చూడు శ్యాం—"అంటూ ఆమె లేచి సావిట్లోకివెళ్ళింది.

''డాక్టరుగారూ, మీకు ఎల్లా వుంటాయో మా పల్లెటూరి యిళ్లు, అలవాట్లు-అందులోనూ మా సుభద్ర చాలా భిడియస్తురాలు" అన్నాడు కామేశ్వర్రావు.

"మరేమీ ఫరవాలేదు. ఎక్కడ ఏవి, ఎల్లావుంటాయో తెలుసు కోవాలనే గదా!" అన్నది సుమిత్ర.

'' నేను కాఫీ తీసుకుంటున్నాను. టవలు బేగ్‌లో వుందా ?'' అన్నదామె భర్తనుద్దేశించి. అతను తలూపాడు.

—క్రింద ఉక్కగా వుందని, డాబామీద పక్కలు వేశారు వాళ్ళకి. క్రింద పనికాగానే పైకివచ్చేయమని కామేశ్వర్రావు భార్యకి చెప్పాడు. ఆమె పనులు తెముల్చుకుని పైకివెళ్ళేసరికి, చాలా ప్రొద్దుపోయింది. సుమిత్ర నిద్రపోతోంది పుస్తకం ముఖానికి అడ్డుపెట్టుకుని. కొంచెం అవతలగా శ్యామసుందర్ కూర్చునున్నాడు. కామేశ్వర్రావు లేడు అక్కడ. సుభద్ర సందేహిస్తోండడం శ్యామసుందర్ చూశాడు.

''రండి. అల్లాకూర్చోండి. కామేశ్వరాన్ని ఎవరో కేకేశారు క్రింద నుంచి. ఇప్పుడే వచ్చేస్తానన్నాడు-ఫరవాలేదు, కూర్చోండి'' అన్నాడు.

పిల్లవాడు ఆడుకుంటున్నాడు. రంగులకొయ్యముక్కలతో మేడలు కట్టమని తండ్రిని వేధిస్తున్నాడు. ఎర్రది కడితే, అదిపడేసి, నీలంది కట్టమనీ, అదికడితే, అన్నీ పడగొట్టమనీ ఏడ్పిస్తున్నాడు. అతను ఓపికగా, పిల్లవాడు చెప్పిందల్లా చేస్తుంటే, పరీక్షగా చూస్తూ కూర్చుంది సుభద్ర.

కామేశ్వర్రావు పైకి వచ్చాడు. కూర్చుంటూ మంచినీళ్ళిమ్మని సుభద్రని అడిగాడు. ఆమె అందిస్తోంటే, చేయిజారి గ్లాసు క్రిందపడింది, ఆ చప్పుడుకి సుమిత్ర లేచింది.

లేచి చుట్టూ చూసింది చీకాకుగా. సుభద్రని చూసి. మెల్లిగా నవ్వింది. "రండి-ఇంకా పడుకోలేదూ? నాకో నిద్ర అయింది'' అన్నది.

"లేపేశాను. మీరు పడుకోండి''అన్నది చాలా సిగ్గుపడుతూ సుభద్ర.

''ఫరవాలేదు. మళ్ళీ యిప్పుడప్పుడే నిద్రపట్టదు. నా సుపుత్రు డేడీ?'' అంటూ వెనక్కి చూసింది. వాడు తండ్రి ఒళ్లో జోగుతున్నాడు అప్పటి కప్పుడే.

"నీ పక్కన పడుకోబెట్టుకుంటావా వాణ్ణి?'' అన్నదామె.

"వద్దు'' అంటూ ఎత్తుకొచ్చి. ఆమె ప్రక్కన పడుకో బెట్టాడు శ్యామసుందర్.

"ఇక్కడ స్కూలు హెడ్మాష్టరుగారితో పరిచయమైంది. వాళ్ళింటికి వస్తానన్నాను. ఏదో కేసుందిట. చూసిపెడతానని చెప్పాను.'' అన్నాడతను.

కామేశ్వర్రావు లేచాడు. "నేవెడుతున్నాను. మళ్ళీ రాకు కిందకి-అమ్మ వుందిగా, తలుపు తీస్తుంది." అన్నాడతను భార్యతో. సుమిత్ర వంక చూసి, క్షమాపణగా నవ్వాడు. "తను అల్లా మేకులా కూర్చుంటుందండీ-నేను వచ్చేదాక "అన్నాడు.

వాళ్ళువెళ్ళాక, సుభద్ర కూర్చుంది.

"పనంతా ఐపోయిందా-ప్రొద్దున్న ఎన్నింటికి లేస్తారు మామూలుగా?" అనడిగింది సుమిత్ర.

"ఐదవుతుంది-మీకు ఎల్లావుందో ఏమిటో మావూరు."

"ఏదీ? యింకా ఏమీ సరిగా చూడందే." అని కొంచెం ఆగి, "కానీ, నాకు కొత్తగావుంది మీ యింట్లో పద్ధతి."

"ఏం?" అన్నది సుభద్ర.

''ఏమీలేదు. మీఅత్తగారూ, ఆవిడ మడి. మీరు, ఆవిడ మాట్లాడుకుంటుంటే, ఎన్నడో విన్న అత్త, కోడళ్ళ సంబంధం గుర్తుకొస్తోంది. మీరూ.ఆయనా మాట్లాడుకోవడం పద్ధతి అదికూడా నాకుక్రొత్తగావుంది.'' కొంచెంఆగి. "మాపద్ధతిమీ కూ ఎబ్బెట్టుగా వుందేమోకూడా"అన్నది.

సుభద్ర నవ్వింది. కొంత ధైర్యం చేసి "ఔను - మా అత్తగారు అన్నారు" అన్నది.

సుమిత్ర పుస్తకం మడిచేసి అవతల పెట్టి, పిల్లాడికి శాలువా కప్పింది. "నాకు అల్లా అలవాటైంది. అదికాక, ఇద్దరం ఒకరి నొకరు సమానంగా గౌరవించుకుంటాం. అల్లాంటప్పుడు 'నువ్వు' అనడంలో తప్పు లేదని పిస్తుంది. వివాహం, నా దృష్టిలో ఒక స్నేహ బంధం వంటిది. ఆ స్నేహ మాధుర్యాన్ని అందించే బాధ్యత, పొందే హక్కు-ఇద్దరికీ సమానంగా వుంటుంది......ఏమంటారు ?"

సుభద్ర తల వూపింది. ఆవిడ కంఠం సన్నని జీరతో వినడానికి ఇష్టంగా వుంది.

"మీలాంటి కుటుంబాలని చూసినప్పుడే నాకు అర్థమౌతుంది-మన సంఘంలో స్త్రీ యింతగా లోకువై పోవడానికి కారణమేమిటో-సంసారంలో సుఖం యివ్వాలి భార్య, వంట చెయ్యాలి, పిల్లల్ని పెంచాలి -అన్ని విధాలా అణగారి పోయి, పురుషుడికి ఏ నొప్పి తెలియకుండా కాపాడుకు రావాలి. ఏం ? ఎందుకని ? ఇద్దరికి చెరి సగము లేదు బాధ్యత ? ఈ రోజుల్లో ఐతే, యివన్నీకాక యింకా ఉద్యోగం కూడ చేసి చేదోడు వాదోడుగా వుండాలి...ఛవ్. నా మనస్సు ఎదురు తిరుగుతుంది". అన్నదామె. ఆమె గొంతు ఆవేశంగావుంది.

సుభద్ర మాట్లాడలేదు. ఈ మాటలు వింటుంటే - ఏమిటో తన శరీరం జలదరిస్తోంది. ఇంత ఆలోచిస్తారా ఆడవాళ్లు అనిపించింది.

"సుభద్రా" అని క్రిందనుంచి అత్తగారి గొంతు వినిపించి లేచిందామె. "మీరు పడుకోండి. వస్తా"అన్నది.

—రెండు రోజులు యిట్టేగడచి పోయాయి. వాళ్లు వెళ్ళిపోయారు. బండీలో వెళ్ళి ప్రక్కవూళ్లో రైలు ఎక్కించి వద్దామని, కామేశ్వరరావు కూడ వెళ్ళాడు.

సాయంత్రమైంది. లాంతర్లు వెలిగించి అన్ని చోట్లా తగిలించింది సుభద్ర. వాళ్లు కాళీ చేసిన ఆ గదిలోకి వెడితే తన మట్టెల చప్పుడే వినిపించి మరింత ఖాళీగా అనిపించింది ఆ గది.

తను ఇవతలకి వస్తోంటే, కామేశ్వరరావు ఎదురు వచ్చాడు. "పద లోపలికి" అన్నాడు చిలిపిగా.

ఆమెనవ్వి లోపలికి నడచింది. ఆమెను లాంతరు దగ్గరకు తీసుకు వెళ్ళి, ఆ వెలుగులో ముఖంలోకి చూశాడు. ఆమె ముఖం త్రిప్పుకుంది.

"ఏమిటంత హుషారుగా వున్నావు?" అన్నాడతను. ఎవరు చెప్పారతనికి అల్లాగని! ఎవరో చెప్పాలా వేరుగా? అతనికే తెలుస్తాయి అన్నీ. ఒకే శ్రుతిలో మేళవించిన తీగల్లాంటివి తమ మనస్సులు—హక్కులు, బాధ్యతలు, చొరలేని మధురలోకం తము విహరించేది. ఆ లోకంలో, రెండు కావు తమ జీవితాలు—ఒకే జీవితం ఇద్దరికీ కలిపి.

తెరచిన పుస్తకంవంటిది తను. అతను తడుముకోకుండా చదివేస్తాడు. తనవంకే చూస్తున్న అతన్ని చూస్తే, సిగ్గుముంచుకొచ్చింది ఆమెకి. "ఏమీలేదు" అన్నది.

"ఏమీలేకపోవడమేమి? చెప్పు" అన్నాడతను.

"ఏమీలేదు. పూసలలోదారం—అదీ—జ్ఞాపకానికి వచ్చింది" అన్నది.

అతను పకపక నవ్వాడు.

[ 1961 ]